క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



కేసముద్రం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం లోని రాజ్యనందన్‌గామ్‌లో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి(ఎస్‌జీఎఫ్‌ఐ) అండర్–17 బాస్కెట్ బాల్ పోటీలకు, కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన పందుల గణేశ్ అనే విద్యార్థి ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజు, పీఈటీ కొమ్ము రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్



మరిపెడ రూరల్: మండల కేంద్రానికి చెందిన దిగజర్ల శ్రీనివాస్ ఇటీవల పద్మశాలీ సంఘం తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియామకం అయ్యాడు. ఆదివారం గజ్వేల్‌లో జగిరిన పద్మశాలీ సన్మాన సభలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకంటి రాజ్‌కుమార్ చేతుల మీదుగా శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందచేశాడు.

రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు



మరిపెడ రూరల్: మండల కేంద్రం నుంచి గిరిపురం గ్రామం వరకు ఉన్న రహదారి ఇరు వైపుల ఏపుగా పిచ్చి మొక్కలు వ్యాపించి ఉన్నాయి. రోడ్డు మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఏ మాత్రం ఆదమరిచిన ప్రమాదం జరిగే అవకాశం ఉందని గిరిపురం గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి ఇరువైపుల అల్లుకుని ఉన్న చెట్ల పొదలను తొలగించి సురక్షితమైన ప్రయాణం కొనసాగేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరారు.

వనభోజనాలు




డోర్నకల్: మండలంలోని చిలుకోడు గ్రామ శివారు మామిడి తోటలో ఆదివారం చిలుకోడు పద్మశాలీలు ఆత్మీయ సమ్మేళనం పేరుతో వన భోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అలవాల రామకృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల వెంకన్న, రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారులమని హల్‌చల్

మరిపెడ రూరల్: కొందరు వ్యక్తులు ఎక్సైజ్ అధికారులమంటూ ఓ బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఇంట్లోకి చొరబడి తనిఖీ పేరుతో హల్‌చల్ చేశారు. ఈ సంఘటన మండల కేంద్రంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. బాధితురాలు పొన్నం రుక్మిణి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం కొందరు ఎక్సైజ్ అధికారులమని రుక్మిణి ఇంట్లోకి చొరబడి తనిఖీలు నిర్వహించారు. దీంతో ఇంట్లో వారు భయభ్రాంతులకు గురయ్యారు. మహిళలమని చూడాకుండా దౌర్జన్యంగా ఇంట్లోకి చొరపడి తనిఖీ చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు వేడుకుంది. ఈ విషయంపై మరిపెడ పోలీస్ స్టేషన్‌లో సదరు వ్యక్తులపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది.

గుప్పుమంటున్న గుడుంబా



దంతాలపల్లి: మండలంలోని పలుగ్రామాలతోపాటు, తండాల్లో ఎక్కడికి వెళ్లిన గుప్పుమంటూ గుడుంబా స్వాగతం పలుకుతోంది. గుడుంబాను తయారు చేయడం కోసం ఓ రకమైన బెల్లాన్ని ఉపయోగించి ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు. ఎక్సైజ్ శాఖ గుడుంబా స్థావరాలపై నామమాత్రంగా దాడులు నిర్వహించి, పట్టుబడిన వారిని కఠినంగా శిక్షించకుండా బైండోవర్లతో వదిలేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు గుడుంబా తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

- యాచకుల నిలయంగా మారిన ప్రాంగణం
- జిల్లా కేంద్రం నుంచి గార్లకు బస్సులు నడపాలని ప్రజల విన్నపం

గార్ల: మండల కేంద్రమైన గార్లలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా ఉండటంతో యాచకులకు నిలయంగా మారింది. బస్సులు బస్టాండ్‌కు వెళ్లకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం గార్ల రైల్వేస్టేషన్ సమీపంలో 20 ఏళ్ల క్రితం సుమారు రూ.7లక్షల వ్యయంతో ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించారు. ఈ బస్టాండ్ నిర్వహణపై ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బస్టాండ్‌లో కంట్రోలింగ్ పాయింట్ కూడా ఏర్పాటు చేయలేదు. కొన్ని బస్సులు మాత్రమే బస్టాండ్‌కు వచ్చి వెళ్తుంటాయి. మిగిలిన బస్సులన్నీ బస్టాండ్‌కు రాకుండానే స్థానిక నెహ్రూసెంటర్ నుంచి వెళ్లిపోతున్నాయి. దీంతో బస్టాండ్‌కు ప్రయాణికులు రాకపోవడంతో బస్టాండ్ బిచ్చగాళ్లకు నిలయంగా మారింది.



శిథిలావస్థలో గార్ల బస్టాండ్

గార్ల నుంచి ఖమ్మం, ఇల్లెందు, పోచారం, డోర్నకల్ మీదుగా ఖమ్మంకు రోజుకు 15 ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. రెండు బస్సులు మినహా అన్ని బస్సులు బస్టాండ్‌కు వెళ్లకుండా గార్ల నెహ్రూసెంటర్ నుంచి వెనక్కు వెళ్లుతున్నాయి. దీంతో ప్రయాణికులకు పాట్లు తప్పడంలేదు. నెహ్రూసెంటర్‌లో ఎండల్లో, వానల్లో బస్సుల కోసం వేచి ఉంటూ ప్రయాణికులు నానా అగచాట్లు పడుతున్నారు. బస్టాండ్‌లో నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు చెత్తచెదారంతో నిండి నిరుపయోగంగా మారాయి. మండలానికి మహబూబాబాద్ ఆర్టీసీ డిపో నుంచి కనీసం నేటి వరకు ఒక్క బస్సు రావడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో కంట్రోలింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేసి, గార్ల మీదుగా తిరిగే అన్ని ఆర్టీసీ బస్సులు విధిగా బస్టాండ్‌కు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా మహబూబాబాద్ డిపో నుంచి మండలానికి బస్సులు నడపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మండలానికి బస్సులు నడపాలి



బస్టాండ్‌లోనికి అన్ని బస్సులు వచ్చి వెళ్లాలి. రైల్వేస్టేషన్ ఎదురుగా బస్టాండ్ ఉంది. రైలు దిగిన ప్రయాణికులు వేరే గ్రామాలకు వెళ్లాలంటే సౌకర్యంగా ఉంటుంది. మండల ప్రజల సౌకర్యార్థం మహబూబాబాద్ డిపో నుంచి గార్ల మండలానికి బస్సులు నడపాలి.

– గౌని భద్రయ్య, మద్దివంచ, గార్ల

సీఎం సభను విజయవంతం చేద్దాం



పెద్దవంగర: మాట్లాడుతున్న సురేష్

పెద్దవంగర: సీఎం సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 19 హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల్లో నిర్వహించ తలపెట్టిన సీఎం సభకు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముత్యాల పూర్ణచందర్, నాయకులు శ్రీనివాస్, సతీష్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

దంతాలపల్లి: సీఎం సభను విజయవంతం చేయాలని తొర్రూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గుగులోత్ బట్టునాయక్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మినేని సతీష్, జిల్లా కమిటీ సభ్యులు సాదు లింగారెడ్డి, బాలాజీ, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్: సీఎం సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్ జైన్ కోరారు. మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో ఆదివారం మాట్లాడారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వీరన్న, నాయకులు శ్రీనివాస్, తారాచంద్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కేసముద్రం: ఫ్రెండ్స్ వెల్ఫేర్ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఇనుగుర్తి మండలం చీన్యాతండాజీపీకి చెందిన జాటోత్ హరిచంద్ ఎన్నికయ్యాడు. ఆదివారం ఇనుగుర్తిలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా మామిడి శోభన్, ఉపాధ్యక్షుడు మలిశెట్టి రవి, మధు, అశోక్, కోశాధికారి ప్రభాకర్, సహాయ కార్యదర్శులుగా సుంకరి రవి, నరేందర్, కార్యవర్గ సభ్యులుగా సంతోష్, శోభన్, బాలు, రామన్న, రహీం, ఆడిట్ సభ్యులను ఎన్నుకున్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న విజయ్‌సారథి

నెహ్రూసెంటర్: రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో సీపీఐ జెండాను ఎగురవేసేలా కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. సీపీఐ మున్సిపల్ వార్డుల ఎన్నికల సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల కోసం 23, 24, 9 వార్డుల్లో కార్యకర్తలు సన్నద్ధమవుతున్నాని తెలిపారు. వార్డుల్లో గత ఎన్నికల్లో తక్కువ మెజార్టీతో సీపీఐ శ్రేణులు ఓడిపోయారని, ఈసారి మున్సిపాలిటీపై ఎర్రజెండా ఎగురవేస్తామని తెలిపారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడ్డామని, ప్రజాసమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, మాలోత్ రవీందర్, ఎర్రోజు పద్మ, ఆలేటి మహేష్, బీమరాజు వెంకన్న, రామ్‌చందర్, విక్రమ్, విజయ్, వీరేందర్, శ్రీకాంత్, పాల్ శ్రీనివాస్, నటరాజ్, అంజలి, సురేష్ పాల్గొన్నారు.

చెరువులపై మత్స్యకారులకే హక్కు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మహాసభ ప్రతినిధులు

తొర్రూరు: చెరువులపై మత్స్యకారులకే హక్కు ఉంటుందని, దాని కోసం ప్రభుత్వం జీఓ తీసుకు రావాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్ అన్నారు. ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా మత్స్య సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్‌తో కలిసి సహదేవ్ మాట్లాడారు. ఈనెల 21 ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పండుగలా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంధం చంద్రమూర్తి, నారాయణ, సోమయ్య, కొండ వెంకన్న, కాగితం యాకయ్య, మహేష్, రామచంద్రు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలబడాలి



జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న పాశం యాదగిరి

మహబూబాబాద్ అర్బన్: డిజిటల్ మీడియా, పాత్రికేయులు ప్రజల పక్షాన నిలబడి న్యాయం చేసి ప్రజల్లో ఉమ్మడి రాజకీయ చైతన్యాన్ని పెంచాలని ప్రముఖ జర్నలిస్ట్ పాశం యాదగిరి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం డీఎంజేయూ ఆవిర్భావ సభకు యాదగిరి హాజరై జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ మీడియా పేదల జీవితాలను వెలికి తీయాలన్నారు. సమాజాన్ని చైతన్యం చేయడంలో డిజిటల్ మీడియా కీలకపాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ కరుణాకర్ రెడ్డి, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు అశోక్, సీనియర్ జర్నలిస్టు కల్లూరి ప్రభాకర్, యూనియన్ వ్యవస్థాపకులు ముత్తేష్, జాతీయ గౌరవాధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, చందా శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం

మరిపెడ రూరల్: రైతుకు మేలు జరిగేలా ఐకేపీల ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం రాములు సూచించారు. అన్నారు. ఆదివారం మండలంలోని తండాధర్మారం గ్రామంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిరిడీ సాయిబాబా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకులు గుగులోతు రాంబాబు, లక్పతి, నిర్వాహకురాలు బుజ్జి, చెన్న, నవీన్, విజయ, బాబునాయక్, విజయ్, సీసీ చందు, బాలాజీ పాల్గొన్నారు. మండలంలోని తాళ్లఊకల్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఛామంతి మహిళ సంఘం ఏర్పాటు చేసుకున్నారు.

పంట అవశేషాలను కాల్చొద్దు



రైతులతో మాట్లాడుతున్న ఏఓ

మహబూబాబాద్ రూరల్: రైతులు పంట అవశేషాలను కాల్చడం ద్వారా భూసారం దెబ్బతింటుందని మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని తూర్పుతండా గ్రామ పరిధిలో ఆదివారం ఏఓ తిరుపతిరెడ్డి వివిధ పంటలను సందర్శించి రైతులతో మాట్లాడారు. వరిపంట కోసిన రైతులు పంట అవశేషాలను కాల్చి వేయవద్దని సూచించారు. వరి కొయ్యలను కాల్చి వేయడం ద్వారా పర్యావరణానికి హాని కలగడం తోపాటు భూమిలో ఉండే సహజమైన పోషకాలు, సూక్ష్మజీవులు నశిస్తున్నాయని పేర్కొన్నారు. ఒక పంట కాలం కోత పూర్తయ్యాక తదుపరి పంటకు పొలాన్ని సిద్ధం చేసే క్రమంలో వరికొయ్యలను కాల్చడం ద్వారా భూసారానికి ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. తద్వారా భూమిలో ఉండే నత్రజని, ఫాస్పరస్ వంటి పోషకాలు తగ్గుతున్నాయని, పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు మరణిస్తున్నాయని వివరించారు. భూమి క్రమంగా సారవంతాన్ని కోల్పోయి భవిష్యత్‌లో వేసే పంటలు దెబ్బతిని దిగుబడి తక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు పంట అవశేషాలను కాల్చివేసే విషయంలో అవగాహన కలిగి ఉండాలని జాగ్రత్తలు వహించాలని సూచించారు. రైతులు బాలు, శంకర్, రవికుమార్, భీమ్లా పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



కేసముద్రం: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: రైతులకు అందుబాటులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని కేసముద్రంవిలేజ్, కల్వల, మహముద్‌పట్నం, ఇనుగుర్తి గ్రామాల్లో కేసముద్రం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారంగా రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు రంగారావు, దీకొండ వెంకన్న, వైస్ చైర్మన్లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, మార్కెట్ డైరెక్టర్ ఎండీ.అయూబ్‌ఖాన్, బండారు వెంకన్న, దయాకర్, బానోతు వెంకన్న, గండి శ్రీనివాస్, కొండా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి



మహబూబాబాద్ అర్బన్: ఎంఈఓలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ స్టేట్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలో దళిత గిరిజన బడుగు బలహీన వర్గాల పేద విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకొచ్చే బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం నూతన ఎంఈఓలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాష్, జిల్లా అధ్యక్షుడు ఇస్లావత్ లచ్చురాం నాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందుల శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి వెంకటేశ్వర్లు, సెక్రెటరీ శంకర్ నాయక్, హెచ్‌ఎంలు బాలాజీ, అనిత, దేవి, పూల్‌చంద్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

గూడూరు: వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా కంపెనీ కోసం భూములు కోల్పోతున్న బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కమిటీ కార్యదర్శి గాదెగోని రవి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని కోరాడు. కార్యక్రమంలో నాయకులు నూకల ఉపేందర్‌యాదవ్, బందెల వీరస్వామి, కటకం బుచ్చిరాములు పాల్గొన్నారు.

మంగక్క ఆశయ సాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న గుమ్మడి నర్సయ్య

గంగారం: ఏజెన్సీ ప్రాంతమైన కొత్తగూడ, గూడూరు, బయ్యారం మండలాల్లో అజ్ఞాత దళంలో పనిచేస్తూ ప్రజలను చైతన్య పర్చిన సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా గ్రామ నాయకురాలు ఈసాల మంగక్క ఆశయాలను సాధించాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. గంగారం మండలంలోని కొడిసెల మిట్ట గ్రామంలో సుదీర్ఘ కాలం పార్టీకి సేవలందించి అనారోగ్యంతో మృతిచెందిన మంగక్క మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ చిన్న చంద్రన్న, మాజీ జెడ్పీటీసీ చంద్రా అరుణ, నాయకులు నాయిని రాజు, పూణెం ప్రభాకర్ ల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రేషన్ కోసం ఇబ్బందులు

గార్ల: మండలంలోని బుద్దారం గ్రామంలో 40 ఏళ్లగా నడుస్తున్న రేషన్ దుకాణంను డోర్నకల్ సమీపంలోని రైల్వేగేటు ప్రాంతానికి మార్చడంతో బుద్దారం గ్రామస్తులు రేషన్ కోసం సుమారు 1.5కిలోమీటర్లు నడిచి వస్తూ వృద్ధులు, దివ్యాంగులు నానా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ దుకాణంను ఎప్పటి మాదిరిగానే బుద్దారం గ్రామంలోనే ఉంచాలని, లేనిఎడల ఇట్టి విషయంపై కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రేషన్‌దుకాణంను బుద్దారంలోనే ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటా..

పెద్దవంగర: చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో మృతి చెందిన శ్రీను కుటుంబానికి అండగా ఉంటానని మాజీ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ నెమరుగొమ్ముల ప్రవీన్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామ పరిధి భీమ్లాతండాకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

విశ్వబ్రాహ్మణులుగా గుర్తించాలి

కురవి: చేతి వృత్తులవారిని విశ్వబ్రాహ్మణులుగా కులగణనలో బీసీ(బీ)గా గుర్తించాలని విశ్వబ్రాహ్మణ సంఘం కురవి మండల అధ్యక్షుడు దూదికట్ల శ్రీనివాసాచారి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు.

వ్యక్తిపై కేసు నమోదు

డోర్నకల్: సమగ్ర కుటుంబ సర్వే విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సీరోలు మండలం చిలుకొయ్యలపాడు గ్రామంలో ఆదివారం పంచాయతీ కార్యదర్శి యాకూబ్‌పాషా విధులు నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త భర్త అనంతరెడ్డి దాడి చేసి విధులకు ఆటంకం కలిగించడంతో అనంతరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



మహబూబాబాద్: విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని విద్యా పరిశోధకుడు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ కార్యవర్గ సభ్యుడు పూరె గురునాథరావు అన్నారు. స్థానిక జిల్లా గ్రంథలయంలో ఆదివారం వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వకృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ విజయేందర్, రవి, రుద్రారపు వీరేందర్, భూలక్ష్మి, భాస్కర్ పాల్గొన్నారు.

సత్యనారాయణ వ్రతాలు

కేసముద్రం: మండలంలోని ధన్నసరి ఫారెస్ట్ రీసెర్చ్ సెంటర్‌లోని ఉసిరివనంలో సాయిదుర్గా కుటీరం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

ఘనంగా వనవిహార్

గార్ల: భారత్ వికాస్ పరిషత్ మహబూబాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం గార్ల సమీపంలోని మామిడితోటలో వనవిహార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి, మారేడు, ఉసిరి మొక్కలకు భారతీయ సాంప్రదాయం పద్దతుల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆవుల శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, గణేష్, భూక్యా హరి, విశ్వనాథం, పున్నమిచంద్, జయప్రకాష్ లోయ తదితరులు పాల్గొన్నారు.

21క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మహబూబాబాద్ రూరల్: అక్రమంగా తరలిస్తున్న 21 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, నూకలను స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపిక రెడ్డి ఆదివారం రాత్రి తెలిపారు. మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామ శివారులో తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ అశోక లేలాండ్ వాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో దానిని ఆపి పరిశీలించి చూశారన్నారు. అందులో ప్రజాపంపిణీ వ్యవస్థకు సంబంధించిన క్వింటా బియ్యం, 21క్వింటాళ్ల నూకలు ఉన్నట్లు గుర్తించామన్నారు. మండలంలోని సీత్లా తండా గ్రామానికి చెందిన లక్ష్మణ్, ఉత్తరతండా జీపీ పరిధిలోని రాయికుంట తండాకు చెందిన గణపతి అనే ఇద్దరు వ్యక్తులు ప్రజల వద్ద నుంచి నూకలు, బియ్యం కొనుగోలు చేసి అశోక్ లేలాండ్ వాహనం ద్వారా మరిపెడ మండలానికి తరలిస్తున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. ఇందుకు సంబంధించి గణపతి, లక్ష్మణ్‌తోపాటు వాహన డ్రైవర్ హుస్సేన్, వాటిని తీసుంటున్న వ్యక్తి రామకృష్ణంరాజుపై కేసు నమోదు చేశామని తెలిపారు.

పరామర్శ..

మరిపెడ రూరల్: మండల కేంద్రానికి చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఫైజ్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆదివారం ఫైజ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు.

ఇంటి నిర్మాణ పనులు అడ్డుకున్న వారిపై చర్య తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని పత్తిపాక ప్రాంతంలో గల 507 సర్వే నంబరులో నూతనంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పనుల సామగ్రిని ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలని బాధితురాలు షేక్ అమీదా అన్నారు. మున్సిపాలిటీ నుంచి అనుమతి తీసుకుని, కోర్టు ఉత్తర్వుల ద్వారా సదరు స్థలంలో ఇంటి నిర్మాణ పనులు చేపడుతుండగా కొందరు వ్యక్తులు వచ్చి వాటిని ధ్వంసం చేసి ఆర్థికంగా నష్టం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నిర్మాణ సిమెంటు పిల్లర్లు ధ్వంసం చేయడమే కాకుండా బోరు పగలగొట్టి దాని మోటారును ఎత్తుకెళ్లి వెళ్లారని పేర్కొన్నారు. తమకు జరిగిన అన్యాయంపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని కోరుతూ బాధితురాలు ఆదివారం మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.